

వనం..మనం.. మనఊరి కోసం

RNI/APTEL/26/A3829

ప్రభ మనం

TELUGU DAILY తెలుగు డైలీ

Gmail: prabhamanam@gmail.com



విలేకరులు కావలెను.

WANTED... WANTED...

ఆంధ్ర, తెలంగాణ నుండి వెలువడుతున్న తెలుగు జాతీయ దినపత్రిక ప్రభ మనం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్సీ ఇంచార్జిలు, సిసి ఇంఛార్జిలు మరియు మండల విలేకరులు కావలెను.

ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.

ఎడిటర్: వి. లింగమూర్తి

9000367833, 8074937223



కర్నూలు : ఎడిటర్ - వడ్డే లింగమూర్తి | సంపుటి : 1 సంచిక : 87 | పేజీలు : 4 వెల రూ./-4 | email: prabhamanam@gmail.com | ఆదివారం 16-08-2026


# తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నాం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- గోల్కొండలో జాతీయ జెండాను ఎగురవేసిన సీఎం రేవంత్ రెడ్డి
- ఆయుధం లేకుండా అహింసతో స్వాతంత్ర్యం సాధించామని వ్యాఖ్య
- దెబ్బతిన్న వ్యవస్థలను32 నెలల్లో గాడిలో పెట్టామని ప్రకటన
- తెలంగాణ తలసరి ఆదాయం దేశం కంటే 91 శాతం అధికమని వెల్లడి
- రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని సీఎం వ్యాఖ్య
- బలమైన ప్రజాస్వామిక భారత్ నిర్మాణానికి పిలుపు



గోల్కొండ కోటలో జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచ చరిత్రలోనే ఆయుధం లేని యుద్ధం భారత స్వాతంత్ర్య పోరాటమని అన్నారు. అహింసతోనూ విజయాన్ని సాధించవచ్చని మహాత్మాగాంధీ నిరూపించారని చెప్పారు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అభివృద్ధికి బలమైన పునాదులు వేశారని పేర్కొన్నారు.స్వాతంత్ర్యం జీవనానికి ఆధారమని, దానికి వెల కట్టలేమని గాంధీజీ చెప్పారని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. హరిత విప్లవం, శ్వేత విప్లవం, నీలి విప్లవం ద్వారా దేశంలోని వివిధ రంగాల అభివృద్ధికి గత ప్రభుత్వాలు కృషి చేశాయని అన్నారు. తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛను అందించడంతో పాటు విధ్వంసకర పాలన నుంచి రాష్ట్రాన్ని వికాసం వైపు తీసుకెళ్లేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పారు. తెలంగాణ భవిష్యత్తుకు అవసరమైన కార్యాచరణను సిద్ధం చేసుకుని ముందుకు - మిగతా 2 లో

# 22ఏ పేరుతో భారీ దోపిడీ జరుగుతోంది



- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్
- నిషేధిత భూముల ముసుగులో భారీ దోపిడీ జరుగుతోందన్న బండి సంజయ్
- ఏకంగా 95 లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో ఎలా చేరుస్తారని ప్రశ్న
- ప్రభుత్వం వేలం వేసిన భూములను కూడా ఈ జాబితాలో చేరుస్తున్నారని విమర్శ

తెలంగాణలో నిషేధిత భూముల జాబితా (22ఏ) ముసుగులో భారీ దోపిడీ సాగుతోందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో - మిగతా 2 లో



# నల్గొండ నా ఊపిరి అభివృద్ధే నా ధ్యేయం

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- నల్గొండలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న కోమటిరెడ్డి
- తన శ్వాస ఉన్నంత వరకు జిల్లా ప్రజల కోసమే పనిచేస్తానన్న మంత్రి
- జిల్లాలో నీటి కష్టాలు తీర్చే బాధ్యతను తాను తీసుకుంటానని వ్యాఖ్య

నల్గొండ జిల్లాను అభివృద్ధి పథంలో పయనింపజేసి, తెలంగాణ రాష్ట్రానికే ఆదర్శంగా నిలబెట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్గొండ పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో ఆయన పాల్గొని - మిగతా 2 లో

# దేశవ్యాప్తంగా కోటి మంది యువతకు ఏఐ శిక్షణ

- పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్
- యువతకు మోదీ పంద్రాగస్టు కానుక
- 80వ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో కీలక ప్రకటన చేసిన ప్రధాని మోదీ
- పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్
- 2036 ఒలింపిక్స్ ఆతిథ్యం లక్ష్యం, క్రీడా ప్రతిభ అన్వేషణకు కొత్త పథకం
- దేశవ్యాప్తంగా కోటి మంది యువతకు ఏఐలో నైపుణ్య శిక్షణ
- సెమీకండక్టర్, అణు విద్యుత్ రంగాల్లో భారీ లక్ష్యాల నిర్దేశం



దేశ యువతకు ప్రధాని నరేంద్ర మోదీ భారీ వరాలు ప్రకటించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో కోటి మంది యువతకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. అలాగే వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందించే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి దేశ ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో ప్రధాని ఈ ప్రకటనలు చేశారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంలో యువతే ప్రధాన లబ్ధిదారులు, కీలక భాగస్వాములని మోదీ పేర్కొన్నారు. యువశక్తిని దేశ అభివృద్ధితో అనుసంధానించాలని పిలుపునిచ్చారు.ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక రంగంలో వేగంగా మార్పు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో భారత్ కొత్త టెక్నాలజీల్లో ముందంజలో ఉండాలని మోదీ తెలిపారు. రోబోటిక్స్, ఏఐ, క్వాంటమ్ టెక్నాలజీ, అంతరిక్షం, డేటా సెంటర్ల వంటి రంగాలు భవిష్యత్ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేయను న్నాయని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే కోటి మంది యువతకు ఏఐ నైపుణ్య శిక్ష అందించనున్నట్లు ప్రకటించారు. దేశ యువతలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా భారత్‌ను ప్రపంచ స్థాయి ఇన్నోవేషన్ హబ్‌గా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఏఐ, రోబోటిక్స్, క్వాంటమ్ టెక్నాలజీ, అంతరిక్ష రంగం, డేటా సెంటర్లు వంటి అభివృద్ధి చెందు తున్న సాంకేతికతల్లో భారత్ నాయకత్వం వహించాలని అన్నారు. యూపీఐ, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా - మిగతా 2 లో

# ఎర్రకోటపై తొలిసారి 'వందేమాతరం' ఆలాపన



2 లో

- స్వాతంత్ర్య వేడుకల్లో చారిత్రక ఘట్టం
- 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో తొలిసారిగా పూర్తి వందేమాతరం గీతాలాపన
- జాతీయ గీతంతో సమానంగా చట్టపరమైన రక్షణ కల్పిస్తూ కొత్త చట్టానికి ఆమోదం
- వందేమాతరం గీతాన్ని అవమానిస్తే కఠిన చర్యలు, జైలు శిక్ష విధించేలా నిబంధనలు

# బెంగళూరులో ఉగ్ర కుట్ర భగ్నం

- టెక్ కంపెనీ సెక్యూరిటీ గార్డ్ అరెస్ట్!
- బెంగళూరులో ఉగ్రవాద సంబంధాలపై ఓ యువకుడిని అరెస్ట్ చేసిన పోలీసులు
- టెక్ కంపెనీలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్న అసాఫుల్ మాలిక్
- తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్‌తో సంబంధాలున్నట్టు వెల్లడి
- ఆఫ్ఘనిస్థాన్ వెళ్లి ఉగ్రసంస్థలో చేరేందుకు సిద్ధమైనట్టు గుర్తింపు
- ఉత్తరప్రదేశ్‌కు చెందిన మరో ఇద్దరిని కూడా అదుపులోకి తీసుకున్న పోలీసులు



2 లో



# మనం అడ్రస్ లేనివాళ్లం కాదు మన కేరాఫ్ అడ్రస్ అమరావతి

- రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్
- విజయవాడలో 80వ స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న మంత్రి నారా లోకేశ్
- ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని తమ విధానమని మరోసారి స్పష్టీకరణ
- ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కట్టుబడి ఉన్నామని వెల్లడి
- కులమతాలకు అతీతంగా స్వర్ణాంధ్ర సాధన కోసం పనిచేద్దామని పిలుపు

కుల, మత, ప్రాంతాలకు అతీతంగా సమష్టి కృషితో స్వర్ణాంధ్రను సాధించు కుందామని రాష్ట్ర విద్య, - మిగతా 2 లో

# ప్రజాస్వామ్య విలువలకు పునరంకితం కావాలి



- వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి
- 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన జగన్
- ప్రజాస్వామ్య సూత్రాలకు పునరంకితం కావాలని పిలుపు
- స్వాతంత్ర్య సమరయోధుల నుంచి స్ఫూర్తి పొందాలని సూచన
- ఉజ్వల, సమ్మిళిత భారతదేశం కోసం కృషి చేద్దామన్న మాజీ సీఎం

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దేశ ప్రజలకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఉదయం సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా ఆయన - మిగతా 2 లో

# ఏటా డీఎస్సీ, యువతకు 20 లక్షల ఉద్యోగాలు

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- సంక్షేమం, అభివృద్ధి జోడెద్దులు
- 2047 నాటికి స్వర్ణాంధ్ర నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమన్న ముఖ్యమంత్రి
- సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తున్నామని వెల్లడి
- ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని, యువతకు భారీగా ఉద్యోగాలు కల్పిస్తామని హామీ
- వచ్చే ఏడాది మార్చి నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్న సీఎం
- అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా నిర్మించి తీరుతామన్న సీఎం చంద్రబాబు



అభివృద్ధి, సంక్షేమాన్ని సమతూకం చేస్తూ 2047 నాటికి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దడమే తన ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. విధ్వంసం నుంచి వికాసం వైపు అడుగులు వేశామని, ఇక వికాసం నుంచి వైభవం వైపు రాష్ట్రాన్ని నడిపిస్తామని ఆయన పిలుపునిచ్చారు. రాజధాని అమరావతిలో జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు చెప్పనివాటిని కూడా అమలు చేస్తూ ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని వివరించారు.ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 'సూపర్ సిక్స్' పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. పెన్షన్లు పెంచి పేదలకు ఆర్థిక భద్రత కల్పించామని, కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా అందరికీ 'తల్లికి వందనం' పథకాన్ని వర్తింపజేస్తున్నామని అన్నారు. 'స్త్రీశక్తి' ఉచిత బస్సు ప్రయాణ పథకం మహిళలకు వరంగా మారిందని, అన్న క్యాంటీన్లతో పేదల ఆకలి తీరుస్తున్నామని చెప్పారు. త్వరలోనే గ్రామీణ ప్రాంతాల్లోనూ అన్న క్యాంటీన్లను విస్తరిస్తామని హామీ ఇచ్చారు. సమాజంలోని ఉన్నత వర్గాలు అట్టడుగు వర్గాలకు చేయూతనిచ్చేలా - మిగతా 2 లో

# సంపాదకీయం

## సంసిద్ధతే వృద్ధాప్యానికి దీర్ఘాయువు



మెసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (మిట్) 'ఏజ్‌ల్యాబ్' డైరెక్టర్ డాక్టర్ జోసెఫ్ కాఫ్లిన్... వృద్ధాప్యం, దీర్ఘాయువు గురించి ఉన్న అపోహలను పటాపంచలు చేశారు. ఎవరి సహాయమూ లేకుండా స్వతంత్రంగా జీవించడమే అసలైన దీర్ఘాయువు అని అంటున్నారు. మీ దగ్గర ఎంతుందన్నది ముఖ్యం కాదు!వయస్సు పైబడుతున్నప్పుడు డబ్బు ఆదా చేయడం, ఆర్థిక ప్రణాళికలు వేసుకోవటం పైనే ఎక్కువ దృష్టి ఉంటుంది. కానీ మనం ఉండే నివాస స్థలాన్ని బట్టి కూడా సగటు జీవితకాలంలో 9 నుండి 13 సంవత్సరాల తేడా వస్తుంది. నడవడానికి అనుకూలమైన రోడ్లు, నమ్మకమైన రవాణా సదుపాయాలు, తాజా ఆహారం, మంచి మౌలిక సదుపాయాలు కలిగి ఉండటమే మీరు ఎంతకాలం, ఎంత ఆరోగ్యంగా జీవిస్తారో నిర్ణయిస్తాయి తప్ప మీ దగ్గర ఉన్న 'పొదుపు మొత్తం' కాదు. ఒకవేళ మీ చుట్టూ ఉన్న వాతావరణం మిమ్మల్ని ఏకాకిగా మార్చితే, మీ బ్యాంక్ ఖాతాలో ఎంత డబ్బు ఉన్నప్పటికీ మీ శారీరక, మానసిక ఆరోగ్యం వేగంగా క్షీణిస్తుంది.జీవితాన్ని నేను 8,000 రోజుల చొప్పున నాలుగు భాగాలుగా చూస్తాను. 0 నుండి 21 సంవత్సరాలు (నేర్చుకునే దశ); 21 నుండి 46 (కెరీర్, కుటుంబం); 46 నుండి 65 (మధ్యవయసులో మనల్ని మనం కొత్తగా ఆవిష్కరించుకోవడం); 65 నుండి 85 పైన (చివరి దశ). ఈ చివరి దశ అనేది పూర్తి అదనపు 8,000 రోజుల ఒక కొత్త అంకం. కేవలం విహారయాత్రలకు వెళ్లడం, లేదా ఖాళీ గదికి రంగులు వేసుకోవడం లాంటి చిన్న చిన్న పనులు మిమ్మల్ని రెండు దశాబ్దాల పాటు ఉత్సా హంగా ఉంచలేవు. జీవితంలో ఈ కొత్త అధ్యాయం కోసం మీకు ఒక పక్కా ప్రణాళిక అవసరం. ఉద్యోగ విరమణ తర్వాత ఆర్థికంగా ఎలా ఉండాలో నేర్పించ డానికి సమాజం తరతరాలుగా సమయాన్ని వెచ్చించింది. కానీ ఆ ఖాళీ సమయాన్ని ఎలా గడపాలో నేర్పించడానికి మాత్రం దాదాపు సున్నా సమయాన్ని కేటాయించింది.ఫైనాన్షియల్ ప్లానర్లు మీరు వైద్య ఖర్చులను భరించ గలరా అని అడుగుతారు; కానీ నేను చాలా సరళంగా అనిపించే ఒక ప్రశ్న అడుగుతాను. ఒక వేడి వేసవి రాత్రి మీకు ఐస్‌క్రీమ్ తినాలనిపిస్తే, మీరు దాన్ని ఎలా వెళ్లి తెచ్చుకుంటారు? ఉదాహరణకు 50 ఏళ్లు పైబడిన అమె రికన్లలో 70 శాతం కంటే ఎక్కువ మంది నగర శివారు లేదా గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. అంటే స్వేచ్ఛగా ఎక్కడికైనా వెళ్లే శక్తిని పూర్తిగా కోల్పోవడమే. నిజమైన స్వేచ్ఛ అంటే కేవలం జీవించి ఉండటం కాదు; వేరొకరిని లిఫ్ట్ అడగాల్సిన అవసరం లేకుండా, మీకు అనిపించిన వెంటనే చిన్న చిన్న ఆనందాలను పొంద గలిగే రవాణా సౌకర్యాలు ఉండటం. ఒక చిన్న ప్రయాణం కోసం మీరు కొన్ని రోజుల ముందే ప్లాన్ చేసుకోవాల్సి వచ్చినా, లేదా బిజీగా ఉండే మీ పిల్లలపై పూర్తిగా ఆధారపడాల్సి వచ్చినా... మీరు ఇప్పటికే మీ స్వేచ్ఛను పోగొట్టుకున్నట్లే.రిటైర్మెంట్ తర్వాత గార్డెనింగ్ చేస్తాననీ లేదా గోల్ఫ్ ఆడతాననీ పరిచయస్తులు తరచూ నాతో చెబుతుంటారు. కానీ మానవ సంబంధాలు లేకుండా ఒంటరిగా కల్పించుకునే హాబీలు త్వరగా విసుగు తెప్పిస్తాయని కోవిడ్--19 లాక్‌డౌన్లు నిరూపించాయి. మీకు కేవలం ఆర్థిక ప్రణాళికలు ఉంటే సరిపోదు. ఒక మామూలు మంగళవారం ఉదయం 10:30 గంటలకు మిమ్మల్ని కలిసి లంచ్ చేయడానికి సిద్ధంగా ఉండే మనుషులతో కూడిన ఒక యాక్టివ్ 'సామాజిక పోర్ట్‌ఫోలియో' కూడా మీకు అవసరం. మీరు ఉద్యోగానికి దూరమైనప్పుడు, ప్రతిరోజూ లభించే సాధారణ సామాజిక సంబంధాలను, ఒక దినచర్యను కోల్పోతారు. మీరు వేర్వేరు తరాల ప్రజలతో ఉద్దేశపూర్వకంగా సంబంధాలను పెంచుకోకపోతే; మీకు నలుగురితో సంభాషణలు, సామాజిక భాగస్వామ్యం లేకపోతే, అత్యంత అవసరమైన సమయంలోనే మీ సామాజిక ప్రపంచం కుంచించుకుపోయి ఉంటుంది.

## ప్రజాస్వామ్య విలువలకు పునరంకితం కావాలి

**మొదటిపేజీ తరువాయి -** తన సందేశాన్ని పంచుకున్నారు. దేశ నిర్మాణానికి మూలస్తంభాలైన ప్రజాస్వామ్య సూత్రాలకు మనమందరం పునరంకితం కావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు."ఈ 80వ స్వాతంత్ర్య దినోత్సవం వేళ, మన గొప్ప దేశాన్ని నిర్మిస్తున్న ప్రజాస్వామ్య విలువలకు మనల్ని మనం పునరంకితం చేసుకుందాం. స్వాతంత్ర్య సమరయోధుల పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకుని, ఉజ్వలమైన, సమ్మిళితమైన, సుసంపన్నమైన భారతదేశం కోసం మనమందరం కృషి చేయాలి" అని జగన్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని, దేశ భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆయన ఆకాంక్షించారు. 'జై హింద్' అంటూ తన సందేశాన్ని ముగించారు.

## 22ఏ పేరుతో భారీ దోపిడీ జరుగుతోంది

**మొదటిపేజీ తరువాయి -** నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనల మధ్య ఎలాంటి తేడా లేదని మండిపడ్డారు.రాష్ట్రంలో ఉన్న 2.77 కోట్ల ఎకరాల్లో ఏకంగా 95 లక్షల ఎకరాలను 22ఏ నిషేధిత జాబితాలో ఎలా చేరుస్తారని బండి సంజయ్ నిలదీశారు. ప్రజలు కష్టపడి కొనుక్కున్న స్థలాలు, పరిశ్రమలకు కేటాయించిన భూములు, ప్రభుత్వమే వేలం వేసిన భూములను కూడా ఈ జాబితాలో చేర్చి వేధిస్తున్నారని విమర్శించారు. విద్యాసంస్థల ఫీజు రీయింబర్స్‌మెంట్ పాత బకాయిలను ఇంకా చెల్లించకుండా, వచ్చే విద్యా సంవత్సరం నుంచి అడ్వాన్స్ ఇస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. జెన్-జీ యువతకు స్థానం కల్పిస్తామనే కాంగ్రెస్ మాటలు నిజమైతే... వెంటనే యువకులకు మంత్రి పదవులు, ఎమ్మెల్సీ సీట్లు కేటాయించాలని సవాల్ విసిరారు.


## నల్గొండ నా ఊపిరి.. అభివృద్ధే నా ధ్యేయం



**మొదటిపేజీ తరువాయి -** జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసు బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించి జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.తెలంగాణ సాయుధ పోరాటంలో నల్గొండ నేల చూపిన త్యాగం, ఆత్మగౌరవం స్వాతంత్ర్య స్ఫూర్తికి ప్రతీకలని అభివర్ణించారు. తన శ్వాస ఉన్నంత వరకు జిల్లా ప్రజల ఆశలు, ఆకాంక్షల కోసమే పనిచేస్తానని చెప్పారు. జిల్లాలో సాగు, తాగునీటి కష్టాలను శాశ్వతంగా తీర్చే బాధ్యత తాను తీసుకుంటానని స్పష్టం చేశారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమానికి పెద్దపీట వేస్తూ 5.35 లక్షల మంది రైతులకు రూ. 715 కోట్ల రైతు భరోసా, 1.99 లక్షల మంది పింఛనుదారులకు రూ. 51.28 కోట్లు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే 17,873 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి 4,360 ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేశామని, 2.56 లక్షల కుటుంబాలకు గృహజ్యోతి కింద ఉచిత విద్యుత్ అందిస్తున్నామని వివరించారు.నల్గొండ పట్టణంలో 24 గంటల మంచినీటి సరఫరా లక్ష్యంతో రూ. 83 కోట్ల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడమే కాకుండా, పట్టణాభివృద్ధి కోసం మరో రూ. 300 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు వెల్లడించారు. యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు రూ. 20 కోట్లతో ఎన్ఏసీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని, అమరవీరుల త్యాగాల సాక్షిగా నల్గొండ జిల్లాను అన్ని రంగాల్లోనూ ప్రథమ స్థానంలో నిలబెడతానని హామీ ఇచ్చారు.

# దేశవ్యాప్తంగా కోటి మంది యువతకు ఏఐ శిక్షణ

**మొదటిపేజీ తరువాయి -** ఇప్పటికే భారత్ తన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిందని గుర్తుచేశారు. ఇక తదుపరి తరం కమ్యూనికేషన్ టెక్నాలజీలోనూ ముందడుగు వేయాల్సిన సమయం వచ్చిందన్నారు.తమ పిల్లలను కోచింగ్ క్లాసులకు పంపకపోతే కుటుంబానికి గౌరవం ఉండదనే భావన తల్లిదండ్రుల్లో నెలకొందని ప్రధాని వ్యాఖ్యానించారు. అయితే ఇక అలాంటి పరిస్థితి అవసరం లేదని అన్నారు. కోచింగ్ కోసం కుటుం బాలు ఖర్చు చేస్తున్న వేల కోట్ల రూపాయలను ఆదా చేసుకునే అవకాశం కల్పిస్తామని చెప్పారు. అదే సమయంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు మరింత దగ్గరగా ఉండి వారి చదువు, భవిష్యత్తుపై శ్రద్ధ పెట్టవచ్చని పేర్కొన్నారు. దేశంలో అందుబాటులో ఉన్న డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్ క్చర్‌ను, ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు, నిపుణుల సేవలను ఒకే వేదికపైకి తీసుకొస్తామని తెలిపారు. వీటి సమన్వయంతో యువతకు వివిధ పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ అందించే సంపూర్ణ ఆన్‌లైన్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. దీని ద్వారా ఖరీదైన కోచింగ్ సంస్థలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుందని



భావిస్తున్నారు.గత దశాబ్ద కాలంలో దేశ విద్యారంగంలో చోటుచేసు కున్న మార్పులను ప్రధాని వివరించారు. 2014 తర్వాత 650 కొత్త యూనివర్సిటీలు దేశంలో ఏర్పడ్డాయని చెప్పారు. 2004-2014 మధ్యకాలంలో దేశంలో 350 కంటే తక్కువ యూనివర్సిటీలు ఉండగా, ఆ తర్వాత 10-12 ఏళ్లలోనే దాదాపు 650 కొత్త విశ్వవిద్యాలయాలు వచ్చాయని మోదీ పేర్కొన్నారు. ఇక వైద్య సీట్లు భారీగా పెరిగాయని తెలిపారు. 2014కు ముందు దేశంలో ఉన్న వైద్య విద్య సీట్ల సంఖ్యతో పోలిస్తే ప్రస్తుతం రెట్టింపుకుపైగా సీట్లు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. వైద్య విద్యకు సంబంధించి దేశంలో అవకాశాలను విస్తరిం చడంతో ఎక్కువ మంది విద్యార్థులకు వైద్య విద్య అభ్యసించే అవకా శం లభిస్తోందని మోదీ పేర్కొన్నారు. దేశంలో దశాబ్దాల తర్వాత కొత్త విద్యా విధానాన్ని తీసుకొచ్చామని ప్రధాని మోదీ అన్నారు. సుమారు 35 ఏళ్ల పాటు కొత్త విద్యా విధానం లేకపోయిందని, ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానంను తీసుకొచ్చిందని చెప్పారు. విద్యార్థుల అవసరాలు, మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా విద్యా వ్యవస్థను తీర్చిదిద్దే దిశగా ఈ విధానం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. భారత్ ఇప్పుడు విదేశీ యూనివర్సిటీలకు కూడా ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారు తోందని మోదీ అన్నారు. విదేశీ విశ్వవిద్యాలయాలు భారత్‌లో తమ కార్యకలాపాలను ప్రారంభించేందుకు అవకాశాలు కల్పిస్తు న్నామని తెలిపారు. అంతేకాకుండా భారతీయ విద్యార్థులు దేశం విడిచి వెళ్లకుండానే విదేశీ యూనివర్సిటీల డిగ్రీలు పొందేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

# ఏటా డీఎస్సీ, యువతకు 20 లక్షల ఉద్యోగాలు

**మొదటిపేజీ తరువాయి -**

'పీ4' కార్యక్రమాన్ని ప్రారంభించామని, తద్వారా ఆర్థిక అసమానతలు లేని సమాజం కోసం కృషి చేస్తున్నామని వివరించారు.నవ్యాంధ్ర భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని ఉద్ఘాటించిన సీఎం, వారికి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. అధికారంలోకి రాగానే తొలి సంతకంతో 15,941 ఉపాధ్యాయ పోస్టులతో 'మెగా డీఎస్సీ 2025'ను పారదర్శకంగా పూర్తి చేశామని గుర్తుచేశారు. ఇకపై ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని ఈ వేదిక నుంచి హామీ ఇచ్చారు. ఈ ఏడాది 10 వేల ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ విడుదల చేశామన్నారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, ఇప్పటికే రూ.24 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయని, వీటి ద్వారా 11 లక్షల ఉద్యోగాలు వస్తాయని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. గూగుల్ ఏఐ డేటా సెంటర్, ఆర్సెలార్ మిట్టల్ వంటి ప్రఖ్యాత సంస్థలు రాష్ట్రానికి వస్తున్నాయని తెలిపారు.రైతన్న సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని నమ్మే తమ ప్రభుత్వం, అన్నదాతలకు అండగా నిలుస్తోందని సీఎం అన్నారు. 'పీఎం-కిసాన్--అన్నదాత సుఖీభవ' కింద రైతులకు ఏటా రూ.20 వేలు అందిస్తున్నామని, ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే డబ్బులు జమ చేస్తున్నామని చెప్పారు. లక్ష కోట్లతో రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని ప్రకటించారు. సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేకంగా దృష్టి సారించామని, రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ఇరిగేషన్ క్యాలెండర్ విడుదల చేశామని తెలిపారు.గత ప్రభుత్వ హయాంలో తీవ్రంగా నష్టపోయిన పోలవరం ప్రాజెక్టును తిరిగి పట్టాలెక్కించామని చంద్రబాబు అన్నారు. రెండేళ్లలో 89 శాతం పనులు పూర్తి చేశామని, వచ్చే ఏడాది మార్చి నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని పునరుద్ఘాటించారు. ఐదున్నర కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అయిన అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా నిర్మించి తీరుతామని స్పష్టం చేశారు. రైతుల త్యాగంతో నిర్మిస్తున్న ఈ రాజధానిలో ప్రస్తుతం రూ.50 వేల కోట్ల విలువైన పనులు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు.ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి, రెవెన్యూ సంస్కరణల ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని సీఎం చెప్పారు. అవినీతి రహిత పాలన కోసం టెక్నాలజీని వినియోగిస్తున్నామని, 'మనమిత్ర' వాట్సాప్ ద్వారా 1100కు పైగా సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల నిర్మాణం వేగంగా జరుగుతోందని, విద్యుత్ రంగంలో సంస్కరణలతో ఛార్జీలు పెంచకుండానే ప్రజలపై భారం తగ్గించామని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని, గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నామని హెచ్చరించారు. అందరి కృషితో వికసిత భారత్ నిర్మాణంలో భాగమవుతూ, స్వర్ణాంధ్రను సాధిద్దామని ఆయన పిలుపునిచ్చారు.

# మనం అడ్రస్ లేనివాళ్లం కాదు మన కేరాఫ్ అడ్రస్ అమరావతి

**మొదటిపేజీ తరువాయి -** ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ విధానాన్ని మరోసారి స్పష్టం చేశారు. "ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం. మనం అడ్రస్ లేని వాళ్లం కాదు.. మన కేరాఫ్ అడ్రస్ అమరావతి" అని ఆయన పునరుద్ఘాటించారు. 2047 నాటికి రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు.విద్యా వ్యవస్థలో తాము చేపట్టిన సంస్కరణలు సత్ఫలితాలనిస్తున్నాయని మంత్రి లోకేశ్ వివరించారు. ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తీసుకొస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నామన్నారు. ఈ విద్యా సంవత్సరంలోనే 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ బడుల్లో చేరారని గర్వంగా ప్రకటించారు. డాక్టర్



సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో స్టూడెంట్ కిట్లు, డొక్కా సీతమ్మ గారి పేరుతో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో రాజకీయాలకు తావు లేకుండా చేశామని, పాఠ్యపుస్తకాలపై కానీ, పాఠశాలల వద్ద కానీ ఎక్కడా ముఖ్యమంత్రి లేదా తన ఫోటోలు ఉండవని స్పష్టం చేశారు. చరిత్రలో తొలిసారిగా, పదో తరగతిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఫోటోలతో ప్రకటనలు ఇచ్చామని గుర్తుచేశారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును సలహాదారుగా నియమించినట్లు వెల్లడించారు. లక్షలాది మంది త్యాగాల ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యమని లోకేశ్ అన్నారు. మహాత్మా గాంధీ, నేతాజీ సుభాశ్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు, టంగుటూరి ప్రకాశం పంతులు వంటి మహనీయుల పోరాట స్ఫూర్తిని స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన పింగళి వెంకయ్య రూపొందించిన జాతీయ జెండాను ఎగురవేయడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. తన తాత, స్వర్గీయ నందమూరి తారక రామారావు పేరు మీద ఉన్న జిల్లాలో స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనడం అరుదైన గౌరవమని తన వ్యక్తిగత ఆనందాన్ని పంచుకున్నారు. విజయవాడ నగరం విద్య, కళలకు నిజమైన రాజధాని అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎర్రకోటపై తొలిసారి 'వందేమాతరం' ఆలాపన

**మొదటిపేజీ తరువాయి -**

భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఒక చారిత్రక, అపూర్వ ఘట్టం ఆవిష్కృతమైంది. దేశ చరిత్రలో తొలిసారిగా ఎర్రకోటపై జరిగిన అధికారిక వేడుకల్లో జాతీయ గేయం 'వందేమాతరం' పూర్తి గీతాన్ని ఆలపించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో జరిగిన ఈ వేడుకల్లో, ఆర్మీ బ్యాండ్ వందేమాతరం గీతాన్ని వాయించగా, ఆ తర్వాత యథావిధిగా జాతీయ గీతం 'జన గణ మన'ను ఆలపించారు. ఈ ఏడాది జాతీయ గేయానికి 150 ఏళ్లు పూర్తి కావడం ఈ సందర్భానికి మరింత ప్రాధాన్యాన్ని చేకూర్చింది.ప్రధాని నరేంద్ర మోదీ ఎర్రకోట బురుజుల నుంచి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన వెంటనే, 1721 ఫీల్డ్ బ్యాటరీ (సెరిమోనియల్) ఆధ్వర్యంలో స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన 105 ఎంఎం లైట్ ఫీల్డ్ గన్స్‌తో 21 సార్లు గన్ సెల్యూట్ చేశారు. ఆ తర్వాత ఆర్మీ బ్యాండ్ 'వందేమాతరం' గీతాన్ని వాయించింది. అదే సమయంలో భారత వైమానిక దళానికి చెందిన రెండు ఎంఐ-17 హెలికాప్టర్లు వేదికపై పూలవర్షం కురిపించాయి. ఒక హెలికాప్టర్‌పై త్రివర్ణ పతాకం ఉండగా, మరో హెలికాప్టర్‌పై 'వందేమాతరం' అని రాసి ఉన్న పతాకం ఎగరడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. "స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎర్రకోటపై వందేమాతరం గీతాన్ని వాయించడం ఇదే తొలిసారి" అని ప్రధాని మోదీ తన ప్రసంగంలో స్పష్టం చేశారు.ఇటీవల జాతీయ గీతంతో సమానంగా వందేమాతరానికి చట్టపరమైన రక్షణ కల్పించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. 'జాతీయ గౌరవ అవమానాల నివారణ (సవరణ) బిల్లు-2026'కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కొద్ది రోజుల క్రితం ఆమోదముద్ర వేశారు. ఈ కొత్త చట్టం ప్రకారం వందేమాతరం గీతాలాపనను ఉద్దేశపూర్వకంగా అడ్డుకున్నా లేదా అవమానించినా జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంటుంది. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు రోజు జాతినుద్దేశించి రాష్ట్రపతి చేసిన ప్రసంగానికి ముందు, తర్వాత కూడా వందేమాతరం పూర్తి గీతాన్ని ప్రసారం చేయడం గమనార్హం. "స్వదేశీ ఉద్యమ సమయంలో వందేమాతరం గీతం ప్రజల పాటగా మారింది" అని రాష్ట్రపతి తన ప్రసంగంలో గుర్తుచేశారు. ఈ కొత్త చట్టంతో జాతీయ గేయానికి జాతీయ గీతంతో సమానమైన గౌరవం, రక్షణ లభించినట్లయింది.

## తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నాం



**మొదటిపేజీ తరువాయి -** సాగుతున్నామని వెల్లడించారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 32 నెలలు పూర్తయ్యాయని సీఎం తెలిపారు. దెబ్బతిన్న వ్యవస్థలను ఒక్కొక్కటిగా గాడిలో పెడుతున్నామని చెప్పారు. తమ సంక్షేమ పథకాలను కేవలం ఆర్థిక లెక్కలతో చూడటం లేదని స్పష్టం చేశారు. సంక్షేమంలో మానవీయత ఉందని, పేదల పట్ల బాధ్యత ఉందని అన్నారు. వారి జీవితాల్లో ఆనందం నింపాలన్న తపనతో కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. ఓట్ల కోసం లేదా మొక్కుబడిగా సంక్షేమాన్ని అమలు చేయడం లేదని స్పష్టం చేశారు.32 నెలల్లో ప్రభుత్వం చేసిన కృషి ఫలితాలు ఇప్పుడు కనిపిస్తున్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ తలసరి ఆదాయం పెరగడం దీనికి ఉదాహరణగా పేర్కొన్నారు. దేశ తలసరి ఆదాయంతో పోలిస్తే తెలంగాణ తలసరి ఆదాయం 91 శాతం అధికంగా ఉందని చెప్పారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందన్నది తమ ప్రభుత్వ నమ్మకమని తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు.స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను సీఎం ఈ సందర్భంగా స్మరించుకున్నారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుకోవాలని, పరస్పర గౌరవం, దేశభక్తి విలువలను పెంపొందించాలని పిలుపునిచ్చారు. అసమానతలు లేని, శాంతి, సౌభ్రాతృత్వాలతో కూడిన బలమైన ప్రజాస్వామిక భారతదేశాన్ని నిర్మించడమే సమరయోధులకు నిజమైన నివాళి అని అన్నారు. ప్రతి పౌరుడికి సమన్యాయం, సమానత్వం, స్వేచ్ఛ అందేలా నవభారత నిర్మాణంలో ప్రతి ఒక్కరూ కర్తవ్యనిష్ఠతో, అంకితభావంతో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## బెంగళూరులో ఉగ్ర కుట్ర భగ్నం



**మొదటిపేజీ తరువాయి -** బెంగళూరులో భారీ ఉగ్ర కుట్రను పోలీసులు భగ్నం చేశారు. ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలపై పశ్చిమ బెంగాల్‌కు చెందిన అసాఫుల్ మాలిక్ అనే యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంలోని జిగాని ప్రాంతంలో ఉన్న ఒక ప్రముఖ టెక్ కంపెనీలో అతను గత ఏడాది కాలంగా సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు.బొమ్మసంద్ర ఇండస్ట్రియల్ ఏరియా పోలీసులు సాధారణ పెట్రోలింగ్‌లో భాగంగా ఆన్‌లైన్ కార్యకలాపాలపై నిఘా ఉంచారు. ఈ క్రమంలో మాలిక్ కదలికలు అనుమానాస్పదంగా కనిపించడంతో శుక్రవారం అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. పోలీసుల దర్యాప్తులో పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి.అఫ్ఘనిస్థాన్‌లోని తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) హ్యాండ్లర్‌తో మాలిక్ నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. త్వరలోనే అఫ్ఘనిస్థాన్‌కు వెళ్లి ఆ ఉగ్రవాద సంస్థలో చేరేందుకు అతను సిద్ధమవుతున్నట్లు వెల్లడైంది. భారత్, పాకిస్థాన్‌లలో దాడులు చేసేందుకు ప్రణాళికలు రచించడంపై వీరి మధ్య చర్చలు జరిగినట్లు అధికారులు తెలిపారు.ఈ కేసుతో సంబంధం ఉన్నట్లు భావిస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన మరో ఇద్దరిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరికి పాకిస్థానీ ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఈ తాజా పరిణామంతో బెంగళూరులో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు.

మనం
ఆదివారం 16-08-2026

# స్వాతంత్ర్య విలువలను కాపాడటమే నిజమైన దేశభక్తి



**తుగ్గలి, ఆగస్టు 15 ( ప్రభ మనం న్యూస్ ):** తుగ్గలి మండలంలోని అన్ని గ్రామాల్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాలను ఆవిష్కరించి దేశ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. గ్రామాల్లో విద్యార్థులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ స్ఫూర్తిని చాటారు. ఈ సందర్భంగా తుగ్గలి ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీపీ రాచపాటి రామంజనమ్మ, ఎంపీడీవో విశ్వమోహన్, ఎంపీపీ సలహాదారు ఆర్. హనుమంతు, ఈఓఆర్డీ శ్రీహరి పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించి జెండాకు వందనం చేశారు. త్యాగాల ఫలితమే స్వాతంత్ర్యం ఎంపీపీ రాచపాటి రామంజనమ్మ మాట్లాడుతూ ఎంతోమంది స్వాతంత్ర్య సమరయోధులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడటం వల్లే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. స్వాతంత్ర్యం అంటే కేవలం జెండా ఎగురవేయడం, వేడుకలు నిర్వహించడం మాత్రమే కాదని, స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను ఆచరణలో పెట్టడమే నిజమైన దేశభక్తి అని పేర్కొన్నారు. దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలు, సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని, విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను సాధించి దేశ ప్రగతికి తోడ్పడాలని సూచించారు.

### అభివృద్ధిలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం

గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆమె అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్వాతంత్ర్య స్ఫూర్తితో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం ద్వారా దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఇంట్లో చోరీ...

**బంగారం కమ్మలు , 20 తులాల వెండి, 10 వేల నగదు అపహరణ**

**సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్సై...**



**మంత్రాలయం , ఆగస్టు 15,మనం న్యూస్ ;** నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయం రామచంద్రనగర్ టావర్ ఏరియా లో ఉన్న చాకలి వెంకటేష్ ఇంట్లో చోరీ జరిగింది. శనివారం మంత్రాలయం ఎస్ఐ మల్లికార్జున తెలిపిన మేరకు గ్రామానికి చెందిన చాకలి వెంకటేష్ గత నెల నుంచి, అనారోగ్య కారణంగా,హైదరాబాద్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు. ఇంట్లో చిన్న కుమారుడు సునీల్ కుమార్ మాత్రమే ఉన్నారు. ఈ నెల 8 తేదిన తండ్రి కి రక్తం నిమిత్తం హైదరాబాద్ వెళ్లాడు.తిరిగి ఇంటికి వచ్చి చూస్తే, గుడిసెతలుపు తాళం పగలగొట్టి, సామాన్లు చెల్ల చెదురుగా పడి ఉన్నాయి. గుర్తు తెలియని దుండదుగులు గుడిసె తలుపు పగులుగొట్టి ఇంట్లోకి వెళ్లి బీరువాలో ఉన్న బంగారు కమ్మలు , 20 తులాల వెండి చైనాలు, ల్యాప్ ట్యాబ్ , వన్ ప్లస్ ఫోన్ ,10 వేల నగదు అపహరించుకు వెళ్ళినట్లు తెలిపారు.సునీల్ కుమార్, తన ఇంట్లో చోరీ జరిగిన విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. ఎస్ఐ మల్లికార్జున,సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సునీల్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఎస్జీటి , స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

**ఎంఈఓ నాగభూషణం**



**మంత్రాలయం , ఆగస్టు 15,మనం న్యూస్ ;-** రాష్ట్ర , జిల్లా విద్యాశాఖ ఆదేశాలు మేరకు అకడమిక్ ఇన్స్ స్ట్రక్టర్ల నియామాకానికి యువతి యువకులు దరఖాస్తు చేసుకోవాలని మంత్రాలయం మండల విద్యాశాఖ అధికారి నాగభూషణం తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్జీటి 707 పోస్టులు , స్కూల్ అసిస్టెంట్ 543 పోస్టులతో కలిపి జిల్లా లో సుమారు 1250 మంది అకడమిక్ ఇన్స్ స్ట్రక్టర్లను ద్వారా ఎంపిక చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అర్హత కలిగిన నిరుద్యోగ యువతి ,యువకులు నుంచి దరఖాస్తులను స్వీకరించుమన్నారు. ఎస్జీటి ఉద్యోగానికి నెల రూ. 10 వేలు , స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగానికి రూ. 12,500 ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 16 నుంచి 21 తేది వరకు మంత్రాలయం విద్యాశాఖ ( ఎంఈఓలు) కార్యాలయంలో దరఖాస్తు తో పాటు విద్యార్హతల ధ్రువ పత్రాలు జత చేయాలన్నారు. దరఖాస్తులను పరిశీలించి ఈనెల 22 జిల్లా విద్యాశాఖ అధికారులకు అందజేయడం జరుగుతుందని , ఎంపిక ప్రక్రియ పూర్తియిన అనంతరం సెప్టెంబర్ 1 తేదిన విధుల్లో చేరే అవకాశం ఉందన్నారు.

## సమరయోధుల త్యాగాల ఫలితమే స్వాతంత్ర్య దినోత్సవం: ఎస్.ఐ లు నరేష్,మల్లికార్జున





**తుగ్గలి ఆగస్టు 15 (ప్రభ మనం న్యూస్):** భారతదేశంలో ప్రతి సంవత్సరం ఆగస్టు 15 న స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోవడం విశేషం మని అన్నారు.శనివారం మండలంలోని తుగ్గలి,జొన్నగిరి పోలీస్ స్టేషన్ లలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎస్.ఐ లు నరేష్, మల్లికార్జున లు మాట్లాడుతూ 1947 ఆగస్టు 15న సుదీర్ఘ పోరాటాల తర్వాత బ్రిటీష్ పాలన నుండి మన దేశం విముక్తి పొందింది.ఈ పవిత్ర దినం దేశ ఐక్యతకు, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు ప్రతీకగా నిలుస్తుంది.200 సంవత్సరా లకు పైగా సాగిన వలస పాలన అంతమై,1947 ఆగస్టు 15న భారతదేశం స్వతంత్ర దేశంగా అవతరించింది సుభాష్ చంద్రబోస్,భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్,అల్లూరి సీతారామ రాజు,వంటి ఎంతోమంది వీరుల ప్రాణత్యాగాల ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ.నాటి నుండి నేటి వరకు పాఠశాలలు,ప్రభుత్వ కార్యాలయాలు మరియు ఇళ్ల వద్ద జెండా వందన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. దేశభక్తి గీతాలు ఆలపించడం,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా జాతి సంబరాలు జరుపు కుంటాయి.దేశం కోసం ప్రాణాలర్పించిన వారిని స్మరించుకుంటూ నివాళులు అర్పించడం జరుగుతుందని అన్నారు.

## సాధన విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు






**ఆగస్టు15( ప్రభ మనం న్యూస్ ):** మండల కేంద్రమైన,తుగ్గలిలోని సాధన విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. జాతీయ జెండాను ఆవిష్కరించి దేశభక్తి నినాదాలతో పాఠశాల ప్రాంగణం మార్మోగింది. ఈ సందర్భంగా చిన్నారులు స్వాతంత్ర్య సమరయోధులు, దేశ నాయకుల వేషధారణలో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి గీతాలు, ప్రసంగాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శ్రీ దండు భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ, భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ఎందరో మహనీయులు తమ జీవితాలను, చివరకు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడారని విద్యార్థులకు వివరించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ఎప్పటికీ మరువకూడదని, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. "దేశం మనకు ఏమిచ్చిందని ఆలోచించడంతో పాటు, మన దేశం కోసం మనం ఏం చేస్తున్నాం? అనే ఆలోచన ప్రతి విద్యార్థిలో ఉండాలి. క్రమశిక్షణ, నిజాయితీ, విద్య, సేవాభావంతో మంచి పౌరులుగా ఎదిగి దేశ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలి" అని విద్యార్థులకు సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.

# ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు ప్రతి ఊరికీ అభివృద్ధి బాట

**స్థానిక నాయకుల ఆధ్వర్యంలో**

**సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించిన,,**

**బత్తిన వెంకటరాముడు, మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు అప్పా వేణుగోపాల్**



**, తుగ్గలి : ఆగస్టు. 15:( ప్రభ మన న్యూస్):** మండల పరిధిలోని కోతి కొండ గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా చేపట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని కోతి కొండ గ్రామంలో నిర్వహించారు. మాజీ జడ్పీ చైర్మన్ బత్తిన వెంకటరాముడు, వ్యవసాయ సొసైటీ చైర్మన్ అప్పా వేణుగోపాల్, టీడీపీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజలకి సంక్షేమం, పథకాలు,అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీల అమలులో భాగంగా తల్లికి వందనం, ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు, అన్న క్యాంటీన్లు, అన్నదాత సుఖీభవ, దీపంపథకాల ద్వారా వివిధ వర్గాలకు ప్రయోజనం చేకూరుతోందని తెలిపారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రతి కుటుంబానికి అందించేందుకు క్షేత్రస్థాయిలో ప్రజలను కలుస్తున్నామని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధితో పాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మాజీ జిల్లా చైర్మన్ బత్తిన వెంకట రాముడు మండల అధ్యక్షుడు తిరుపాల్,నాయుడు,మారెళ్ళ సొసైటీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి ఎద్దులదొడ్డి శ్రీనివాసులు గౌడ్ కొమ్ము వెంకటేశ్వర్లు ఎడవలి తిమ్మప్ప మసాలా శీను చంద్రశేఖర్ వెంకటరెడ్డి ఉపాధ్యక్షుడు వెంకటరాముడు పెండేకల్ వీరేష్ అలిగేరి చంద్రన్న, కమ్మ వెంకట్రాముడు,నరసింహులు,డీలర్ అయ్యన్న,ఎర్రబాటి రంగయ్య,ఉలితప్ప, ఎద్దులదొడ్డి, మాజీ సర్పంచ్, విజయ్,ఎద్దులదొడ్డి ఫీల్డ్ అసిస్టెంట్,రవి,అర్జునప్ప,గోవిందప్ప,అలిగేరి పెద్దయ్య, తదితరులు పాల్గొన్నారు

# రెపరెపలాడిన మువ్వన్నెల జెండా...మూడు రంగుల జెండా

**పెద్దకడబూరు మండలంలో - ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు**

**టీడీపీ రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి**

**టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి నరవ శశిరేఖ**

**ఎంపీపీ శ్రీవిద్య.. వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి**

**టీడీపీ సీనియర్ నాయకులు బసలదొడ్డి ఈరన్న**

**టీడీపీ మండల అధ్యక్షులు గవిగట్టు మల్లికార్జున**










**పెద్దకడబూరు ఆగస్టు 15,ప్రభ మనం:** మండలంలోని వివిధ గ్రామాల్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలు,స్వర్ణ గ్రామ కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద జాతీయ జెండాలను ఎగురవేసి దేశభక్తిని చాటుకున్నారు.పెద్దకడబూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.ప్రాథమిక పాఠశాల (మెయిన్), కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి నరవ శశిరేఖ జెండా ఆవిష్కరించారు.మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శ్రీవిద్య,రామ్మోహన్ రెడ్డి,తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వలిబాషా,పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మారుతి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.సొసైటీ ఆవరణలో చైర్మన్ తలారి మీ సేవ ఆంజనేయులు ఆంజనేయులు,విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏఈ నారాయణస్వామి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిణి ఫిరదౌస్,బీసీ హాస్టల్‌లో వార్డెన్ అజీమ్, ఎమ్మార్సీ భవనంలో ఎంఈఓ-1 జగదీష్,ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపల్ ఆర్.పీ. రాఘవేంద్ర,మండల వ్యవసాయ కార్యాలయంలో ఏవో సుచరిత జాతీయ జెండాలను ఎగురవేశారు శ్రీ వెంకటసాయి యూపీ పబ్లిక్ స్కూల్‌లో కరస్పాండెంట్ శేఖర్, శ్రీ బాల వికాస యూపీ పబ్లిక్ స్కూల్‌లో కరస్పాండెంట్ విశ్వనాథ్‌రెడ్డి జెండా ఆవిష్కరించారు. బసలదొడ్డిలో టీడీపీ సీనియర్ నాయకుడు గవిగట్టు ఈరన్న, మండల అధ్యక్షుడు గవిగట్టు మల్లికార్జున, చిన్నకడబూరులో విద్యా కమిటీ చైర్మన్ కంపాటి లక్ష్మన్నతో పాటు పలువురు నాయకులు యం. జి.నరసన్న,బూషి రెడ్డి, దశరత్ రాముడు,గౌళ్ళ నల్లారెడ్డి, జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.చిన్నతుంబలం గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకులు వీరేష్ గౌడ్,సొసైటీ ఛైర్మన్ కందనాతి నరసప్ప,సాగునీటి సంఘం అధ్యక్షులు చాకలి చిన్న నారాయణ,టీడీపీ యువనేత మాల శివ,కల్లుకుంట జెడ్పీ పాఠశాలలో హెచ్‌ఎం సురేష్‌బాబు,డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మాజీ సర్పంచ్ ఇస్మాయిల్, విజయ్‌కుమార్,నాగరాజు జెండా ఆవిష్కరించారు.స్థానిక అంబేద్కర్ విగ్రహం దగ్గర జిల్లా కార్యదర్శి బొగ్గుల యేసేపు,కెవిపి ఎస్ అధ్యక్షులు దేవదాస్,కార్యదర్శి యం. రామన్న ఎస్.ఎఫ్.ఐ.మండల కార్యదర్శి బి. విల్సన్,రాజు,దొడ్డిమేకలలో మాజీ సర్పంచ్ చంద్రశేఖర్,హనుమాపురంలో టీడీపీ నాయకులు బీపీ ఈరన్న,రాజశేఖర్, కంబదహాల్‌లో టీడీపీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ మునెప్ప,పీకలబెట్టలో టీడీపీ నాయకులు తోవి ఈరన్న,హనుమంతు,వైసీపీ నేత మూలింటి మూకిరెడ్డి, హెచ్.మురువని, హులికన్వి, మెగడోనా,గవిగట్టు,గ్రామాలలో జాతీయ పతాకాలను ఎగురవేశారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని,దేశ ఐక్యత,సమగ్రతను కాపాడేందుకు ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.యువత దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని, విద్య, క్రమశిక్షణ,సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని సూచించారు.గ్రామాల అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభావతి దేవి, డిప్యూటీ ఎంపీడీఓ లక్ష్మన్న,ఈఓఆర్డీ జయరాముడు,ఏవో కౌసల్య,ఏపీఓ రాజేశ్వరమ్మ,ఆర్ఐ జెర్మియా,ఏఎస్ఓ వెంకటేశ్వర్లు,జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు,కేజీబీవీ ప్రిన్సిపల్ రుక్సానా పర్వీన్,సొసైటీ సీఈవో మురళీధర్ రెడ్డి,జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం ఉమా రాజేశ్వరమ్మ,టీడీపీ బీసీ సాధికార రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లికార్జున,టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మొత్రు రామాంజనేయులు,బూత్ యూనిట్ ఇన్ చార్జ్ తలారి అంజి,ప్రాథమిక పాఠశాల (మెయిన్) విద్యా కమిటీ చైర్మన్ హనుమంతు,ఆశన్న,ఆదాము,యం.రాము తదితరులు పాల్గొన్నారు

# భారతమాతకు సెల్యూట్ స్వాతంత్ర్య సమరయోధులకు వందనం

**ఏరిగేరిలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు**


**విద్యార్థులతో కలిసి నృత్యం చేసిన మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి**



















**కౌతాళం,ప్రభ మనం,ఆగస్టు,15:** మండలం ఏరిగేరి గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జ్ శ్రీ ఎన్. రాఘవేంద్ర రెడ్డి గారు, యువనాయకులు శ్రీ ఎన్. రాజారెడ్డి గారు ముఖ్య అతిథులుగా హాజరై జాతీయ జెండాను ఎగురవేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలతో కలిసి స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్. రాఘవేంద్ర రెడ్డి గారు మాట్లాడుతూ, విద్యారంగానికి ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ గారు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దాలనేది మంత్రి నారా లోకేష్ గారి లక్ష్యమని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం, మెరుగైన వసతులు కల్పించి, భవిష్యత్తులో వివిధ రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. "మన పల్లె మారాలి.. మన రైతు బాగుపడాలి.. మన గ్రామాలు అభివృద్ధి చెందాలి.. మనమంతా అభివృద్ధి చెందాలి" అనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ పాఠశాలకు ఏ అవసరం వచ్చినా తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు చూపించిన ఉత్సాహం, దేశభక్తితో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను కన్నుల పండువగా నిర్వహించడం అభినందనీయమని ప్రశంసించారు. విద్యార్థులతో కలిసి నృత్యం.. వేడుకల్లో మరింత సందడి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో విద్యార్థులతో కలిసి టీడీపీ ఇన్‌చార్జ్ శ్రీ ఎన్. రాఘవేంద్ర రెడ్డి గారు ఉత్సాహంగా నృత్యం చేసి సందడి చేశారు. దీంతో విద్యార్థులు, గ్రామస్తుల్లో మరింత ఉత్సాహం నెలకొంది. ప్రతిభావంతులకు బహుమతులు.. ఉపాధ్యాయులకు ఘన సన్మానం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు ఎన్. రాఘవేంద్ర రెడ్డి గారు బహుమతులు అందజేసి అభినందించారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ ర్యాంక్ సాధించిన విద్యార్థులకు మెడల్స్ అందజేసి సత్కరించారు. విద్యార్థుల విజయానికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులను కూడా ఘనంగా సన్మానించి, వారి సేవలను అభినందించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువనాయకులు సతీష్ నాయుడు, మండల అధ్యక్షులు సురేష్ నాయుడు, కౌతాళం సొసైటీ చైర్మన్ వెంకటపతి రాజు, మండల ఉపాధ్యక్షులు కురువ వీరేష్, టౌన్ ప్రెసిడెంట్ రాజానందన్, బీజేపీ నాయకులు వెంకట రెడ్డి, జనసేన నాయకులు రామాంజి, నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షులు రామకృష్ణ, గ్రామ సీనియర్ నాయకులు రామాంజులు, గబుగ అంజనేయ్య, ముకయ్య, గ్రామ అధ్యక్షులు బసవరాజు, గ్రామ నాయకులు గిద్దయ్య, స్కూల్ చైర్మన్ శ్రీరాములు, యూనిట్ ఇన్‌చార్జ్ చెవుల రమేష్, వద్దే రంగస్వామి, బూత్ ఇన్‌చార్జ్ ఉప్పర వీరేష్, ఎస్సీ సెల్ వీరేష్, చిదుర భీమేష్, ఆంజనేయ్య తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భూ వివాదంలో పురుగుల మందు తాగి మృతి చెందిన ఈరమ్మ కుటుంబాన్ని పరామర్శించిన శ్రీమతి బుట్టా రేణుక గారు

బాధిత కుటుంబాన్ని ఓదార్చి ధైర్యం చెప్పిన శ్రీమతి బుట్టా రేణుక గారు


వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపునే కాకుండా వ్యక్తిగతంగా ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ

అవసరమైన న్యాయ సహాయం అందిస్తామని భరోసా

ఈరమ్మ మృతికి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.. ప్రభుత్వానికి డిమాండ్







**గోనెగండ్ల,ఆగస్టు,15,ప్రభ మనం:** మండలంలో భూ వివాదం నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురై పొలంలోనే పురుగుల మందు తాగి మృతి చెందిన చాకలి ఈరమ్మ కుటుంబాన్ని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్త, మాజీ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి బుట్టా రేణుక గారు, బుట్టా ఫౌండేషన్ అధినేత శ్రీ బుట్టా శివ నీలకంఠ గారు స్వయంగా పరామర్శించారు. ఈరమ్మ కుటుంబ సభ్యులను పలకరించి, వారి ఆవేదనను విని, కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఈరమ్మ మృతికి దారితీసిన పరిస్థితులను శ్రీమతి బుట్టా రేణుక గారి దృష్టికి తీసుకువచ్చారు. వారి బాధను విన్న ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేసి,"మీ కుటుంబం ఒంటరిగా లేదు.. మీకు న్యాయం జరిగే వరకు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మరియు నేను మీకు అండగా ఉంటాను" అంటూ కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు.శ్రీమతి బుట్టా రేణుక గారు మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున మాత్రమే కాకుండా, వ్యక్తిగతంగా కూడా ఎల్లవేళలా అండగా ఉంటానని, అవసరమైన న్యాయ సహాయాన్ని సైతం అందించి న్యాయం జరిగే వరకు తోడుగా నిలుస్తానని హామీ ఇచ్చారు.ఈరమ్మ మృతికి దారితీసిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని శ్రీమతి బుట్టా రేణుక గారు డిమాండ్ చేశారు. పేద, బలహీన వర్గాల కుటుంబాలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు."ఒక కుటుంబం తన హక్కు కోసం పోరాడుతూ కన్నీటిపర్యంతం కావాల్సిన పరిస్థితి రావడం బాధాకరం. ఈరమ్మ కుటుంబానికి న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గేది లేదు. అవసరమైతే న్యాయపోరాటం కూడా చేస్తాం" అని శ్రీమతి బుట్టా రేణుక గారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సాంస్కృతిక విభాగ కార్యదర్శి కాశిరెడ్డి గారు, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు బోయ దొరబాబు నాయుడు గారు, గోనెగండ్ల యువ నాయకులు బోయ రవి నాయుడు గారు, ఎమ్మిగనూరు పట్టణ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఢ నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షులు డి నజీర్ అహ్మద్ గారు, చేనేత విభాగ జిల్లా అధ్యక్షులు ఎంకే శివప్రసాద్ గారు, ఎంపీటీసీ తాయప్ప గారు, చాకలి దుబ్బన్న గారు, చాకలి కరెన్న గారు, చాకలి మద్దిలేటి గారు, కురువ లింగన్న గారు, చాంద్ గారు నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ప్రశంసపత్రాలు అందుకున్న అధికారులు



**మంత్రాలయం ఆగస్టు 15,మనం న్యూస్ ;** స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నిబద్ధత నిజాయితీ క్రమశిక్షణతో ప్రజలకు సేవ చేసినందుకుగాను, మంత్రాలయం పంచాయతీ అభివృద్ధి అధికారి,ఉపేంద్రరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ రాఘవేంద్రకు ఉత్తమ ప్రశంస పత్రాలు శనివారం అందజేశారు. ఈ పురస్కారం పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ,కలెక్టర్ డాక్టర్ సిరి, ఎస్పీ విక్రమ్ పాటిల్ చేతుల మీదుగా అందుకున్నారు. పలువురు అధికారులు, ప్రజలు ,నాయకులు వారిని అభినందించారు.

## ఈరన్న స్వామి ఆలయంలో మువెన్నెల జెండా..

జాతీయ జెండాను ఎగురువేస్తున్న ఆలయ ఈఓ.వాణి





**కౌతాళం, ప్రభ మనం,ఆగస్టు,15:** ప్రసిద్ధి పుణ్యక్షేత్రం మైన ఉరుకుంద గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహ ఈరన్న స్వామి వార్ల దేవస్థానం నందు 80వ స్వాతంత్ర దినోత్సవం కార్యక్రమం డిప్యూటీ కమీషనర్ మరియు కార్యనిర్వహణాధికారి శ్రీమతి కె.వాణి గారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగినది.ఈ కార్యక్రమంలో దేవస్థాన అర్చకులు, పర్యవేక్షకులు మరియు సిబ్బంది పాల్గొనియున్నారు..

# మహనీయుల త్యాగ ఫలితమే స్వాతంత్ర్యం

## మండలంలో పంద్రాగస్టు వేడుకలు





**మంత్రాలయం , ఆగస్టు 15,మనం న్యూస్ ;** మహనీయుల త్యాగఫలతమే దేశానికి స్వతంత్రం సిద్ధించిందని, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షులు భీంరెడ్డి , స్పెషల్ ఆఫీసర్ మండల వ్యవసాయ అధికారి జీరా గణేష్ అన్నారు. శనివారం 80వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని వాడవాడలో మువ్వన్నెల జండాలను ఎగురవేశారు. మంత్రాలయం మండల పరిధిలోని బూదురు సూగురు వగరూరు, రచ్చమరి, మాలపల్లి చట్నహల్లి బసాపురం రాంపురం నారాయణపురం, తిమ్మాపురం సుంకేశ్వరీ,కాగ్గలు, కల్లుదేవకుంట చిలకలడోణ గ్రామాల్లో నీ పాఠశాలలో సచివాలయాలు మువ్వన్నెల జండాలను ఎగురవేశారు. 52 బసాపురంలో వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ భీమ్ రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాలలో సచివాలయం లో స్వతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కల్లు దేవ కుంట పాఠశాలల్లో హెచ్ఎం, అలాగే సొసైటీ కార్యాలయంలో సొసైటీ చైర్మన్ రాగమ్మ, డైరెక్టర్ భీమయ్య, సీఈవో వెంకటేష్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు.సూగురు జడ్పీహెచ్ పాఠశాలలో గ్రామంలో హెచ్ఎం, లచ్చప్ప చైర్మన్ హనుమంతు, జెండా ఆవిష్కరించారు. టీడీపీ నాయకులు గోపాల్ నరసింహులు, ఇజ్రాయిల్ ,రవి బసవరాజు శేఖర్ తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు. కేజీబీవీ పాఠశాలలో ప్రిన్సిపల్ శాంతి ఆధ్వర్యంలో స్వతంత్ర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. రాచ్చుమరి మోడల్ స్కూల్ నందు ప్రిన్సిపల్ అశోక్ నాయక్ నేతృత్వంలో, జెండాను ఆవిష్కరించారు. రాచ్చమర్రి గ్రామంలో హెచ్ఎం ప్రాణేష్ఆచారి, టిడిపి నాయకులు పోలే శివ, పోలే వీరేష్, తిమ్మప్ప బంద్రల నరసింహులు, హుసేని హనుమంతు ల ఆధ్వర్యంలో ఘనంగానే నిర్వహించారు. మాలపల్లి లో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి వెంకటేష్ మాజీ జడ్పిటిసి స్పెషల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో పాఠశాలలో అలాగే సచివాలయంలో స్వతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యానగర్ ఎస్ఎంకెవి పాఠశాలలో హెచ్ఎం రామాంజనేయులు ఉపాధ్యాయులు లక్ష్మీకాంతం ఆధ్వర్యంలో మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు. బూదూరు గ్రామంలో హెచ్ఎం భూషణం హెచ్ఎం రంగస్వామి విద్యా కమిటీ చైర్మన్ మోషే ఆధ్వర్యంలో పాఠశాలలో జెండా ఎగురవేశారు. పాఠశాలల్లో నిర్వహించిన క్రీడల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమానం ప్రధానం చేశారు అలాగే స్వీట్లు పంపిణీ చేశారు.

## రాఘవుడి సన్నిధిలో కర్ణాటక రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి అజయ్ ధరమ్ సింగ్



**మంత్రాలయం , ఆగస్టు 15, మనం న్యూస్ ;-** ఆధ్యాత్మిక క్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం కర్ణాటక రాష్ట్ర మైనర్ ఇరిగేషన్ , సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి అజయ్ ధరమ్ సింగ్ శనివారం మంత్రాలయం కు వచ్చారు. వారికి మఠం అధికారులు సాంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. వారు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకొని , ప్రత్యేక పూజలు చేసి మంగళహారతి ఇచ్చారు. అనంతరం రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. వారికి మఠం పీఠాధిపతులు సుభుదేంద్ర తీర్థులు శేషవస్త్రం కప్పి , ఫల మంత్రాక్షితలు ,రాఘవేంద్రస్వామి మెమోంటో ఇచ్చి ఆశీర్వదించారు.వారి వెంట మఠం ఏఏఓ మాధవ్ శెట్టి , మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు , వెంకటేష్ జోషి , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్ కొనపూర్ , ఎస్ఐ మల్లికార్జున , తదితరులు ఉన్నారు.

# రెపరెపలాడిన మువ్వన్నెల జాతీయ జెండా పతాకం

బాధ్యతతో దేశ నిర్మాణంలో భాగస్వాములవుదాం

టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి నరవ శశిరేఖ

రెయిన్ బో స్కూల్ కరస్పాండెంట్ గోవింద్ రెడ్డి

ప్రధానోపాధ్యాయులు ప్రసాద్

పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు జగతప్ప పుల్లయ్య

విద్యార్థులతో క్రీడా పోటీలతో సహా బహుమతులు అందజేస్తున్న దృశ్యం..





**పెద్దకడబూరు ఆగష్టు 15,ప్రభ మనం:** పెద్దకడబూరు గ్రామంలోని రేయిన్ బో ఇంగ్లీషు మీడియం హైస్కూల్ లో కరస్పాండెంట్ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం పండుగ వాతావరణంలో జరిగాయి.వేడుకలకు ముఖ్య అతిథిగా టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి,మాజీ ఎంపీపీ నరవ శశిరేఖ హాజరయ్యారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ జెండాను ఎగుర వేశారు. అలాగే కరస్పాండెంట్ గోవిందరెడ్డి జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సాధనకు కృషి చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. మహాత్మాగాంధీ,నేతాజీ సుభాష్ చంద్రబోస్,భగత్సింగ్, అల్లూరి సీతారామరాజు వంటి ఎందరో మహనీయుల పోరాట స్ఫూర్తితోనే దేశానికి స్వాతంత్ర్యం లభించిందన్నారు.స్వాతంత్ర్యం కేవలం హక్కులను అనుభవించడమే కాకుండా దేశం పట్ల బాధ్యతలను నిర్వర్తించడమని తెలిపారు.రాజ్యాంగ విలువలను గౌరవించడం,దేశ ఐక్యతను కాపాడటం, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయడం, విద్యాభివృద్ధికి తోడ్పడటం ప్రతి పౌరుడి కర్తవ్యమన్నారు.యువత దేశ భవిష్యత్తుకు దిక్సూచిగా నిలవాలని,క్రమశిక్షణ,నిజాయితీ, దేశభక్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.మహనీయుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని అభివృద్ధి చెందిన, సమానత్వంతో కూడిన భారతదేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.అనంతరం విద్యార్థులు పేరేడ్ మార్చ్ ఫాస్ట్,పిరమిడ్,శారీ డ్రిల్ ప్రదర్శన ఆకట్టుకుంది.అలాగే సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు డాన్స్ తో విద్యార్థులు అలరించారు.గత ఏడాది ఎస్ఏ - 2 పరీక్షలలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రేయిన్ బో హైస్కూల్ లో జాతీయ జెండాకు వందన సమర్పణ చేస్తున్న దృశ్యం మాట్లాడుతున్న కరస్పాండెంట్ గోవిందరెడ్డి దేశ నాయకుల వేషధారణలో రేయిన్ బో హైస్కూల్ విద్యార్థులు మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి నరవ శశిరేఖ

## రైతులకు తాగు , సాగు నీరు అందించాలి

మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి



**మంత్రాలయం ఆగస్టు 15,మనం న్యూస్ :** తుంగభద్ర డ్యాం నది, దిగువ కాలువ పరిధి లో ఉన్న రైతులకు తాగు, సాగు నీటిని అవసరమైన స్థాయి లో విడుదల చేసి ఆదుకోవాలని మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి అన్నారు.. శనివారం మండల పరిధిలోని రాంపురం గ్రామంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 2023లో వైఎస్సార్సీపీ హయాంలో టీబీ డ్యాం నందు 84 టీఎంసీలు ఉన్నప్పుడు కూడా ఖరీఫ్ పంటలకు అవసరమైన స్థాయి లో నీరు అందించడం జరిగింది. కానీ కూటమి ప్రభుత్వం హయాంలో ఇప్పటికి వరకు డ్యాం లో 89 టీఎంసీలు నీరు ఉన్నప్పటికి రైతులకు నీరు విడుదల చేయకుండా నిర్లక్ష్యం గా వ్యవహరిస్తున్నారు..... రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఇప్పటికి నివేదిక ద్వారా నీటిని విడుదల చేయాలని కోరింది లేదు......ఇంత వరకు ఐఏబీ(ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డ్) సమావేశం నిర్వహించ లేదు.... దీనికి తోడు ఈ నెలాఖరు లో శ్రీ రాఘవేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాలు వారం రోజుల తో పాటు కౌతాళం మండలం ఉరుకుందు ఈరన్న స్వామి దేవస్థానం లో శ్రావణ మాసం ఉత్సవాలు కూడా జరగుతున్నాయి. ప్రస్తుతం డ్యాం నుంచి వదిలిన నీరు ఏపీ సరిహద్దు లకు కూడా చేరే అవకాశం లేదన్నారు.. దీంతో మంత్రాలయం వద్ద భక్తుల స్నానాలకు కూడా నీరు లేకుండా పూర్తి స్థాయిలో ఎండిపోయింది.. ఇప్పటికైన అధికారులు, కూటమి ప్రభుత్వం సకాలంలో స్పందించి దిగువన రైతు లకు కాలువ, నది ద్వారా నీటిని విడుదల చేయాలని కోరారు. లేని పక్షంలో నియోజకవర్గ రైతు లతో కలిసి టీబీ డ్యాం వద్దకు చేరుకుని నిరసన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

# ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు






**మంత్రాలయం , ఆగస్టు , 15,మనం న్యూస్ :-** నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయం లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మంత్రాలయంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల చైర్మన్ మద్రి నరసింహులు , ప్రధానోపాధ్యాయులు విఠోభరావు, టీడీపీ పట్టణ అధ్యక్షులు వరదరాజులు జాతీయ జెండా ను ఎగరవేశారు. అలాగే తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రమాదేవి , స్థానిక పోలీసు స్టేషన్ లో సిఐ దస్తగిరిబాబు , ఎస్ఐ మల్లికార్జున , మంచాల సొసైటీ కార్యాలయంలో సొసైటీ డైరెక్టర్ డిసి తిమ్మప్ప , చాపల నాగేష్ , పంచాయతీ కార్యాలయంలో తహశీల్దార్ రమాదేవి , పంచాయతీ కార్యదర్శి ఉపేంద్ర రెడ్డి , టిడిపి పట్టణ అధ్యక్షుడు వరదరాజు , సొసైటీ డైరెక్టర్ డిసి తిమ్మప్ప స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్ని జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను ఫలితమే స్వాతంత్ర దినోత్సవం అన్నారు. వివిధ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేసి ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిన్నభీమ , పవన్ కుమార్ , ఆర్కే రఘు , గుడిసె రాజన్న , మంగలి మల్లి , మద్రి శివ కుమార్ , విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు

Office adress....EDITED & PUBLISHED AND OWNED BY.EDITOR : V.LINGAMURTHY. PUBLISHED AT : VSAR PUBLICATION VSAR PUBLICATIONS91/4-31-3-1B, BALAJINAGAR, KURNOOL, ANDHRA PRADESH - 518006CONTACT NO :9000367833.RNI,APTEL/26/A 3829,E-MAIL.ID prabhamanam@gmail.com